క్లుప్తంగా

బాధితులకు ఆర్థిక సాయం అందజేత



ఆత్మకూరు: ఇటీవల ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా బాధిత కుటుంబాలకు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి శనివారం ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలోని రెండో వార్డు వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన పుల్లారెడ్డి, అజీమాలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయా కుటుంబీకులను శనివారం పరమేశ్వరరెడ్డి పరామర్శించి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. వార్డు కౌన్సిలర్ శివకోటారెడ్డి, ట్రస్ట్ సభ్యుడు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

- రూ.80 వేలకుపైగా నష్టం



చేజర్ల(ఆత్మకూరు): గడ్డివామి దగ్ధమైన ఘటన చేజర్ల మండలంలోని యనమదల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాధిత రైతు ఆదిరెడ్డి శేఖర్‌రెడ్డి వివరాల మేరకు.. ఇటీవల వరికోతల అనంతరం పశువుల కోసం పది ఎకరాలకుపైగా గడ్డిని నిల్వ చేశారు. ఈ క్రమంలో శనివారం 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో రూ.80 వేలకుపైగా నష్టం సంభవించిందని బాధిత రైతు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ముగిసిన ఉద్యోగుల నిరసన



డిపో ఎదుట నిరసన చేస్తున్న ఉద్యోగులు

ఉదయగిరి: స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎస్ఎంయూఏ ఉద్యోగుల నిరసన కార్యక్రమాలు ఐదో రోజు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. జిల్లా కమిటీ పిలుపు మేరకు ఐదు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో డిపో ఎస్ఎంయూఏ నాయకులు వెంకటేశ్వర్లు, శంకర్, నాగరాజు, రమణయ్య, జ్యోతి, నాగమణి, సుజాత, కోటేశ్వరరావు, రాజు, శ్రీను పాల్గొన్నారు.

గోదామును సద్వినియోగం చేసుకోవాలి



గోదాము వద్ద సొసైటీ సభ్యులు

ఉదయగిరి రూరల్: మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో కొట్టాలపల్లి సొసైటీ ఆధ్వర్యంలో రైతుల కోసం నిర్మించిన బహుళ ప్రయోజన గోదామును సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి, సీఈఓ పోలయ్య కోరారు. ఈ మేరకు వారు శనివారం గోదాము వద్ద బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గోదాములో 500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిలువ చేసుకునే సామర్థ్యం ఉందన్నారు. మరిన్ని వివరాలకు 76758 16814, 94415 88985 నంబర్లను సంప్రదించాలన్నారు.

చాముండేశ్వరికి అశ్వవాహన సేవ



ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు అశ్వవాహనంపై భక్తులను కటాక్షించారు. పుష్పాలంకరణతో శోభాయమానంగా వీధుల్లో ఊరేగుతున్న అమ్మవారిని భక్తులు దర్శించి తన్మయం చెందారు. ఉభయకర్తలుగా స్థానిక వైశ్య సంఘీయులు వ్యవహరించారు. ఉదయం చప్పర ఉత్సవం జరిగింది. ఆలయ అర్చకులు అనిల్ స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఉత్సవం సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.



ఉదయగిరి ఈద్గా వద్ద..



కొండాపురం: సాయిపేటలో..



జలదంకిలో..



అల్లూరు: జామియా మసీద్‌లో..



ఆత్మకూరు: ఈద్గాకు వెళ్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్



ఉదయగిరి: శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్, దాసరుపల్లి, అయ్యవారిపల్లి, బీజంపల్లి, పుల్లాయిపల్లి తదితర గ్రామాల్లో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయగిరి పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గాల వద్ద మత పెద్దలు ఖురాన్ సందేశం అందించడంతో పాటు, బక్రీద్ విశిష్టతను వివరించారు. చిన్నారులు, పెద్దలు ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానాలు చేశారు.

- **కొండాపురం:** మండలంలోని ముస్లింలు బక్రీద్ పండగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. కొమ్మి, సాయిపేట, రేణమాల, తూర్పుఎర్రబల్లి, వెంకటరంగాపురం, గరిమెనపెంట తదితర గ్రామాల్లోని ముస్లింలు వారి కుటుంబాల్లో మృతిచెందిన పెద్దలను స్మరించుకుంటూ నమాజ్‌లు చేశారు. అనంతరం చుట్టుపక్కల వారికి అన్నదానం చేశారు.
- **జలదంకి:** త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని జలదంకి, బీకే అగ్రహారం, గట్టుపల్లి, జమ్మలపాళెం, సోమవరప్పాడు, కృష్ణాపాడు, చోడవరం తదితర గ్రామాల్లో మసీదులను ప్రత్యేకంగా అలంకరించి సామూహిక నమాజులు చేశారు. మతపెద్దలు బక్రీద్ విశిష్టతను వివరించారు. సొంత ప్రయోజనాల కన్నా దైవజ్ఞానం, నిస్వార్థసేవ గొప్పదన్నారు. అనంతరం ముస్లింలు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.
- **అల్లూరు:** స్థానిక మసీద్ సెంటర్‌లోని జామియా మసీద్, బీసీ కాలనీలోని మదీనా మసీద్‌లో బక్రీద్ సందర్భంగా ముస్లింలు శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. కార్యక్రమంలో ఇమామ్ అజ్మల్, షేక్ సమద్, షేక్ ఆకూర్, షేక్ ఉస్మాన్ షరీఫ్ పాల్గొన్నారు.
- **ఆత్మకూరు:** మహమ్మద్ ప్రవక్త బోధనల మేరకు ప్రతిఒక్కరూ శాంతియుతంగా జీవించాలని ఈద్గా మసీదు ఇమామ్ క్రము జమా అన్నారు. బక్రీద్ పండగను పురస్కరించుకుని ఈద్గాలో శనివారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అల్లాహ్ బోధనలు, మహమ్మద్ ప్రవక్త సూక్తులను వివరించారు. తొలుత ముస్లింలు సత్రం సెంటర్ వద్ద నుంచి అల్లాహ్‌ను కీర్తిస్తూ దర్గా మైదానానికి చేరుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇళ్ల వద్ద బంధువులతో విందు భోజనాలు చేశారు.
- మండల కేంద్రమైన చేజర్ల మసీదులో, ఆదూరుపల్లి గ్రామ మసీదులో ముస్లింలు శనివారం ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. అనంతరం పేదలకు దానాలు చేశారు.
- **ఆత్మకూరురూరల్ :** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహిమలూరు, కరటంపాడు, బొటికర్లపాడు, బోయలచిరివెళ్ల, అప్పారావుపాళెం, అశ్వనీపురం, బట్టేపాడు, దేపూరు, నాగులపాడు తదితర గ్రామాల్లో బక్రీద్ కోలాహలం నెలకొంది. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పేదలకు అన్నదానాలు చేసి తమ భక్తిని చాటుకున్నారు.
- **అనుమసముద్రంపేట:** ఏఎస్‌పేట మండలంలోని పలు దర్గాల్లో ముస్లింలు శనివారం బక్రీద్ వేడుకలను నిర్వహించారు. మండల కేంద్రంలోని హజ్రత్ ఖాజా నాయబ్ రసూల్ దర్గాతో పాటు హసనాపురం, రాజవోలు, గుడిపాడు, అనుమసముద్రం గ్రామాల్లోని ఈద్గాల్లో ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ప్రతి మనిషి శాంతియుతంగా జీవితాన్ని కొనసాగించాలన్నదే మహమ్మద్ ప్రవక్త సందేశమన్నారు.
- **దుత్తలూరు:** మండల వ్యాప్తంగా బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని దుత్తలూరు, నందిపాడు, లక్ష్మీపురం, వెంకటంపేట, ఏరుకొల్లు తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు ఖురాన్ ప్రవచనాలు వివరించారు.
- **సీతారామపురం:** మండలంలోని సీతారామపురం, తురకపాళెం, అయ్యవారిపల్లి, నారాయణప్పపేట, గంధంవారిపల్లి, రంగనాయుడుపల్లి, సింగారెడ్డిపల్లి, బసినేనిపల్లి తదితర గ్రామాల్లో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మేరకు ఈద్గాల వద్ద సమూహిక ప్రార్థనలు చేశారు.
- **సోమశిల:** అనంతసాగరం మండల పరిధిలోని గౌరవరం, ముస్తాపురం, ఉప్పలపాడు, సోమశిల, పాతదేవరాయపల్లి, ఆమనిచిరివెళ్ల, ఇనగలూరు తదితర గ్రామాల్లో బక్రీద్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక నమాజ్‌లు చేశారు.
- **వింజమూరు(ఉదయగిరి):** స్థానిక బంగ్లా సెంటర్‌లో ఉన్న ఈద్గా మైదానంలో ముస్లింలు బక్రీద్ పండగను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మత గురువు ముక్తి మౌలానా నిజాం ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి.
- **కావలి (జలదంకి):** కావలి పట్టణంలోని ఈద్గాల వద్ద ముస్లింలు శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం బక్రీద్ ఈద్ ముబారక్ చెప్పుకుంటూ ఆలింగనం చేసుకున్నారు.
- **సంగం :** సంగంలోని చెక్‌పోస్టు సెంటర్ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద ముస్లింలు బక్రీద్ వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



సీతారామపురంలో..



చేజర్ల మసీదులో..



ఆత్మకూరు రూరల్: బొటికర్లపాడు దర్గాలో..



ఏఎస్‌పేటలో..



దుత్తలూరులో..



సోమశిల: అనంతసాగరంలో..



వింజమూరులో..



సంగం ఈద్గా వద్ద..

దోచుకోవడం, దాచుకోవడమే టీడీపీ నైజం

- కలప తరలింపుపై మండిపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: కూటమి పాలనలో ప్రజల సొమ్మును అందినకాడికి దోచుకోవడం, దాచుకోవడమే టీడీపీ నైజంగా ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. పట్టణంలోని బ్రిటీష్‌కాలం నాటి ఎంపీడీఓ కార్యాలయం భవనాన్ని కూల్చి రంగూన్ టేకు తరలింపుపై సాక్షి దినపత్రికలో ప్రచురితం కావడంతో చెర్లోయడవల్లి గ్రామంలోని కలపను పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయానికి ఉదయం 8 గంటల్లోపే తరలించారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనల మేరకు పార్టీ పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, సొసైటీ మాజీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డిలు పట్టణంలోని మేకపాటి క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పాతకాలం నాటి భవనాలు పట్టణానికి ఐకాన్‌లుగా ఉన్న క్రమంలో వాటిని కూల్చేందుకు ఎవరు అనుమతించారని ప్రశ్నించారు. కూల్చిన అనంతరం కలపను టీడీపీ నాయకుడు స్వగ్రామానికి తరలించేందుకు అధికారులు ఎలా అనుమతించారని నిలదీశారు. ప్రజాప్రతినిధికి దోచిపెట్టేందుకు, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేందుకు అధికారులు ఈవిధంగా సహకరిస్తున్నారా అని ప్రశ్నించారు. గతంలోనూ ఇదేవిధంగా నారంపేట సెజ్ వద్ద లక్షలాది రూపాయల విలువైన జామాయిల్‌ను నరికి సొమ్ము చేసుకున్న విషయం మరువకముందే మళ్లీ సుమారు రూ.30 లక్షల విలువ గల భవనానికి చెందిన కలపను ఆయన ఇంటికి చేర్చుకోవడం వారి దోపిడీకి పరాకాష్టగా ఉందన్నారు. వాచ్‌మెన్ కాపలా ఉన్న ప్రాంతంలో కలప చోరీకి గురవుతుందని తరలించినట్లు ఎంపీపీ తెలపడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజల ఆస్తులకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రతినిధులు ఇలా దోచుకోవడం సరికాదని, ఇప్పటికే పలు ఆరోపణలు ఉన్న ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తరలించిన కలపలో కొంతే తిరిగి ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరిందని, ఇందులో ఎంత కైంకర్యం చేశారో మంత్రి జోక్యం చేసుకుని విచారణ చేయాలన్నారు. పార్టీ నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, సయ్యద్ జమీర్, జనార్దన్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు, జమ్రు, మహిళా నేతలు కల్పనారెడ్డి, హేమ తదితరులు పాల్గొన్నారు.

మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరామర్శ



మాల్యాద్రి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మేకపాటి

కొండాపురం: మండలంలోని భీమవరప్పాడు పంచాయతీ ఉప సర్పంచ్ విడవలపాటి మాల్యాద్రి నాయుడు ఇటీవల గుండెజబ్బుతో చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన కుటుంబాన్ని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి భార్య, సర్పంచ్ గోవిందమ్మతో పాటు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చంద్రబాబు మాటలకు మోసపోయాం

కాగా అక్కడికి వచ్చిన మహిళలు ఆయనతో మాట్లాడుతూ చంద్రబాబు మాటలు విని మోసపోయామని వాపోయారు. దీనిపై స్పందించిన మేకపాటి కూటమి ప్రభుత్వ కుట్రలను ఏడాది పాలనలో ప్రజలు గ్రహించారని, వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని తెలిపారు. టీడీపీ అరాచకాలకు మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సహనం వహిస్తూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు చిమ్మిలి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీటీసీ బొడ్డు మాధవరెడ్డి, మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు, కొల్లి రామారావు, విడవలపాటి రాఘవ, కోనేటి అంకబాబు, ఉన్నం నవీన్, ఉన్నం రోశయ్య, సోమినేని రాజా, మందపాటి శేషగిరి, తల్లపనేని బ్రహ్మయ్య ఉన్నారు.

సమాధుల ధ్వంసంపై ఫిర్యాదు

- టీడీపీ నేతల అండతో ఇలాంటి దుశ్చర్య



రామవరప్పాడు శ్మశానవాటికలో ధ్వంసమైన సమాధులు

జలదంకి: మండలంలోని రామవరప్పాడు గ్రామంలో తమ పూర్వీకుల సమాధులను ధ్వంసం చేశారని గ్రామానికి చెందిన శోభన్‌కుమార్, ఉదయ్‌కుమార్, సౌజన్యలు శనివారం జలదంకి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాధితులు మాట్లాడుతూ మా తల్లిదండ్రులు మరణించిన అనంతరం వారి సమాధులను గ్రామ శ్మశానవాటికలో నిర్మించుకున్నామన్నారు. అయితే శుక్రవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడి అండతో శెట్టిపల్లి శ్రీనివాసులు, గుండాబత్తిన నితిన్, బొడ్డు సుధీర్, బొడ్డు కాంతమ్మ, గల్లా జని, ఏకోబులు తమ పూర్వీకుల సమాధులను ధ్వంసం చేశారన్నారు. శ్మశాన స్థలాలను సైతం ఆక్రమించేందుకు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే తమను గ్రామంలో కూడా ఉండనివ్వమని బెదిరిస్తున్నట్లు వాపోయారు. పోలీసులు తమకు న్యాయం చేయాలని కోరారు.

ప్రాథమికోన్నత పాఠశాలల అప్‌గ్రేడ్



ఎంఈఓ మస్తాన్‌వలీ

ఉదయగిరి రూరల్: మండలంలోని పలు ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాలలుగా మార్పు చేసినట్లు ఎంఈఓ-1 షేక్ మస్తాన్ వలీ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వెంకట్రావుపల్లి, దాసరపల్లి, ఉదయగిరి ఉర్దూ, ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలగా అప్‌గ్రేడ్ చేశామన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయన్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు, సభ్యులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు తెలియజేయాలన్నారు.

ప్రాణం పోతేనే స్పందిస్తారా..?



ప్రమాదం జరిగిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచెను ఏర్పాటు చేసిన అధికారులు

ఉదయగిరి: ఉదయగిరి ఆనకట్ట సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని పలుమార్లు స్థానిక ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా స్పందించలేదు. ఫలితంగా శుక్రవారం సాయంత్రం ఉదయగిరి మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన రాగిపాటి నరసమ్మ ఆ మార్గంలో వెళ్తూ కాలుజారి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి మంటలు చెలరేగడంతో తీవ్రంగా గాయపడింది. ఈ క్రమంలో ఆమెను నెల్లూరుకు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ప్రమాదం జరిగిన తర్వాత రాత్రికి రాత్రే సంబంధిత శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు, ప్రజాగ్రహం నుంచి తప్పించుకునేందుకే శరవేగంగా ఆ ప్రాంతంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ముందుగానే స్పందించి ఉంటే ఆమె బతికి ఉండేదని పలువురు వాపోతున్నారు.

విద్యుదాఘాతానికి గురైన వృద్ధురాలు మృతి

ఉదయగిరి రూరల్: విద్యుదాఘాతానికి గురై నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు శనివారం మరణించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉదయగిరి మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన రాగిపాటి నరసమ్మ (65) అనే వృద్ధురాలు శుక్రవారం సాయంత్రం ఉదయగిరి పట్టణంలోని ఆనకట్టపై నడుచుకుంటూ వెళ్తూ ప్రమాదవశాత్తు కాలుజారి తక్కువ ఎత్తులో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి తీవ్ర గాయాల పాలైంది. ఈ క్రమంలో ఆమెను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

ఆత్మారామునికి శేషవాహన సేవ



నృత్యం చేస్తున్న మహిళలు



శేషవాహనంపై ఆత్మారామస్వామి

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామంలో కొలువైన ఆత్మారామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఆలయంలోని ఆత్మారామస్వామి ఉత్సవమూర్తిని శేషవాహనంపై ఉంచి విశేష పూలతో సుందరంగా అలంకరించారు. అనంతరం వేద పండితులు, వేద మంత్రోచ్ఛారణల నడుమ ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం గ్రామంలో గ్రామోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఇళ్ల ముంగిటకు వచ్చిన స్వామివారికి భక్తులు కొబ్బరికాయలు సమర్పించి కర్పూర హారతులిచ్చి స్వాగతించారు.

అలరించిన నృత్యం

గ్రామోత్సవం వెంట తెలంగాణ నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో హాజరైన మహిళలు పలురకాల గీతాలతో చేసిన నృత్య విన్యాసాలు గ్రామీణులను అలరించాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు గ్రామోత్సవం, నృత్యాలు జరిగాయి.